# కావేరి

ఉపద్రష్ట సాయి

అప్పుడు సమయం రాత్రి తొమ్మిది గంటలు.

కైలాసపురానికి ఆఖరి బస్సు వచ్చే సమయం. ఆ బస్సులోనే సూర్యం వచ్చాడు. సుమారు ఐదు వందల గడపలున్న ఆ ఊరు ఎనిమిది గంటలైతే జోగుతుంది. తొమ్మిది గంటలకల్లా మత్తుగా నిద్రలో మునుగుతుంది. చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కల పొదలు. మధ్యలో ఒంటికాలి బాట. చీకట్లో ఊరు మరింత అందంగా కనిపిస్తూంది.

అక్కడక్కడా కొబ్బరి తోటలు, మామిడి తోటలు, నిశ్చలంగా కదలకుండా మెదలకుండా నిలబడున్నాయి. కార్తీక మాసం కావడం మూలాన చలి కూడా వేస్తూంది. కీచురాళ్ళ చప్పుడు చెవులకు తూట్లు పొడుస్తున్నాయి. దూరంగా ఇళ్ళలో కిరసనాయిల్ దీపాలు వెలుగుతున్నాయి. దారంతా పిచ్చి మొక్కల మయంగా వుంది. "అనుబంధం... ఆత్మీయత అంతా ఒక నాటకం" దూరంగా వాయు తరంగాల మీద స్వారీ చేసి వచ్చింది పాట...

సూర్యం ఊరు వదిలి పోయి సరిగ్గా మూడు సంవత్సరాలైంది. మళ్ళీ కైలాస పురానికి రాకూడదన్న వైరాగ్యంతోనే పోయాడు. కానీ... ఈ మూడు సంవత్సరాలలో తనను ప్రతిక్షణం వెంటాడింది కావేరి.

ఇంతలో మళ్ళీ ఎదురుగుండా ఎవరో వస్తున్నట్లైంది. తలెత్తి చూశాడు సూర్యం. మరోసారి చూశాడు. మళ్ళీ అతనిలో భయం ఆవహించింది. ఎదురుగా వస్తున్న మనిషి సూర్యం దగ్గరికి వచ్చింది...

"బాబూ! కావేరిని చూశారా బాబూ! కావేరి మంచిది బాబూ... చూస్తే చెప్పండి బాబూ..." అంటూ సూర్యంను అడుగుతూంది. ఆమె మొహంలోకి పరీక్షగా చూసిన సూర్యం ఆశ్చర్యపోయాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. అవును... నిజం... ఆమె... ఆమె... పర్వతమ్మ... కావేరిని కన్న పర్వతమ్మ. ఆమె ఇలా ఐపోయిందా? ఆమెకా ఈ గతి..!? ఆలోచనలు సూర్యం మనసును తొలిచేస్తున్నాయి. మూగ పోయిన గొంతుతో ఆమెను చూసి మళ్ళీ నడవడం మొదలుపెట్టాడు. ఏం చేయాలో తెలియక.

మనిషి నడుస్తున్నా మనసు మాత్రం గత స్మృతులను నెమరు వేసుకుంటూంది. ఐదు సంవత్సరాల క్రితం తను కైలాసపురం వచ్చినప్పుడు కావేరి వయసు పంతొమ్మిది. మనిషి ఎర్రగా, బొద్దుగా, మిసమిసలాడుతూ ఎంతో అందంగా చూపరులను ఆకర్షించే విధంగా వుండేది. అగ్రికల్చరల్ ఆఫీసరుగా వచ్చిన తను మొదటి సారి కావేరిని చూసినప్పుడు, ఏ మాత్రం కొత్తగా ఫీలవకుండా తనతో మాట్లాడింది. ముఖ్యంగా ఆ వయసులోవున్న ఆడపిల్లలు, స్త్రీలకు సహజంగా వచ్చే సిగ్గుతో అపరిచయస్తులతో అంత చనువుగా మాట్లాడరు. కానీ కావేరి మిగిలిన వారికి భిన్నంగా మాట్లాడింది. క్షణం ఊరుకోకుండా, పొలం కట్టమీద అటూ ఇటూ తిరుగుతూ పసపిట్టలా వాగింది.

"పాపం! అభం శుభం తెలియని అమాయకురాలనుకున్నాడు తను. అప్పటి నుంచి తను ఎప్పుడు కనిపించినా ఏవేవో మాట్లాడేది. తన చేతిలోని ముంజలను, వేరు శనక్కాయలను, జొన్న పొత్తులను ఇచ్చి "తినండి సార్! భలే వుంటాయి" అనేది. ఏ మాత్రం బిడియం లేకుండా తన చెయ్యి పట్టుకుని నడిచేది - ఒక్కొక్కప్పుడు సిగ్గు పడడం తనవంతయ్యేది. తనతో మాత్రమే అలా ప్రవర్తిస్తుందా అంటే కాదని త్వరలో తెలిసింది.

కావేరి అందరితోనూ అలాగే ప్రవర్తించేది.

అప్పటికే అందరూ కావేరిని తిట్టేవారు.

సిగ్గూ శరమూ లేకుండా ఆడా మగా తేడా లేకుండా అలా తిరుగుతుందని. కానీ కావేరి ఆ మాటలు పట్టించుకునేది కాదు. కావేరి జీవితం గురించి మెల్లగా ఆరా తీశాడు తను. కావేరి తండ్రి కావేరికి ఐదు సంవత్సరాల వయసున్నప్పుడే చనిపోయాడని తెలిసింది.



కావేరి తల్లి ఊళ్ళో పెద్ద ఇళ్ళలో వంటావార్పూ చేసి బతికేది. ఒక్కగానొక్క కూతుర్ని అల్లారు ముద్దుగా పెంచింది. తండ్రిలేని బిడ్డ కోసం తన రెక్కలు విరుచుకుని కష్టపడేది. అలా పద్నాలుగు సంవత్సరాలు, ఊళ్ళో వాళ్ళకు ఊడిగం చేసింది. కానీ కావేరి పెరుగుతున్న కొద్దీ తల్లి పర్వతమ్మకు సమస్యగానే తయారైంది. ఎప్పుడూ తోటివారితో దెబ్బలాడడం, లేకపోతే వాళ్ళ చేతుల్లోని వస్తువులను లాక్కోవడం వంటివి చేసేది. అంతేకాక తన తల్లి ఒక బీద మనిషని, వున్న వాళ్ళ పిల్లలు కూడా కావేరితో ఆడుకోవడానికి వచ్చేవారు కారు. బళ్ళో చదువుకోవడానికి పంపిస్తే అక్కడ కూడా కావేరి అందరితోనూ పసపిట్టలా మాట్లాడడం, చెప్పిన పని సరిగా చెయ్యకపోవడం మూలాన బళ్ళో వాళ్ళు కూడా కావేరిని ఇంటికి పంపించేశారు.

తండ్రిలేని బిడ్డ కదా అని అల్లారు ముద్దుగా పెంచినందుకే కావేరి అలా తయారైందని బాధపడేది పర్వతమ్మ. కావేరికి తోబుట్టువులు లేరు. వున్న ఒక్కతోడు తల్లి. రేపు ఆ తల్లికి ఏమైనా జరిగితే కావేరి గతి ఏమవుతుందో... అని బాధపడేది కూడా. ఈ పరిస్థితిలో కావేరి పుష్పవతి కావడం, కావేరిలో శారీరక మార్పులు రావడం జరిగింది. మూర్తీభవించిన స్త్రీమూర్తిలా మారినా కావేరి వయసుకు తగినట్లు ప్రవర్తించేది కాదు. తన ఇంటి దగ్గరి కాపురాల వాళ్ళతో చనువుగా ఎప్పటిలా మాట్లాడేది. తమ భర్తలతో కావేరి చలాకీగా, తేడాలు లేకుండా ప్రవర్తించడాన్ని సహించుకోలేక పోయారు వాళ్ళు. పర్యవసానంగా అడపా దడపా పర్వతమ్మకూ వాళ్ళకూ దెబ్బలాటలు వచ్చేవి. భర్త పోయిన బాధ ఒక వైపు, కూతురి వల్లబాధ మరో వైపు పర్వతమ్మను కృంగదీసింది.

ఈ పరిస్థితిలో సూర్యం కలిసినప్పుడల్లా పర్వతమ్మ అతనితో తన బాధను చెప్పుకునేది. ఈ పరిస్థితికి కారణం ఏమిటా అని ఆలోచించిన సూర్యం ఒక రోజు కావేరిని, పర్వతమ్మను తీసుకుని పట్నం వచ్చాడు. తనకు తెలిసిన ఒక డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్ళాడు. కావేరి గురించి వివరంగా చెప్పాడు. శ్రీనివాసరావుగారు కావేరి గురించి పూర్తిగా విని ఆమెను పరీక్షించి న్యూరో డాక్టర్ ధర్మరాజు గారి దగ్గరికి వెళ్ళమని వారి ఉత్తరం

కూడా రాసిచ్చాడు. ఆయన దగ్గరకు వెళ్ళిన తరువాత ఒక నిజం... చేదు నిజం బయట పడింది... పర్వతమ్మ బోరుమంది.

కావేరి 'హైపర్ యాక్టివ్' మనిషని తేలింది. ఈ రకం మనుషులు మామూలు మనుషుల కన్నా కొన్ని రెట్లు ఎక్కువగా హుషారుగా వుంటారు. ఏ పని మీదా పూర్తి ధ్యాస వుంచరు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ వుండాలని తాపత్రయ పడతారు. కావేరి కూడా ఆ కోవకు చెందిన మనిషని చెప్పారు ధర్మరాజు గారు. ఈ పరిస్థితి కొంచెం కొంచెంగా మెరుగవడానికి ప్రయత్నం చేయగలమని కొన్ని మందులు రాసిచ్చారు. బాగవుతుం దనేనమ్మకంతో తిరుగు ముఖం పట్టారు సూర్యం పర్వతమ్మలు.

మందుల వాడకం జరుగుతూంది.

తనూ సహాయం చేసేవాడు.

కానీ చుట్టు ప్రక్కల వాళ్ళతో ఎప్పటిలా మాట్లా డడం మాత్రం ఆపలేదు కావేరి. ఫలితంగా, వారి భార్యా భర్తల మధ్య దుమారాలు కూడా లేచేవి. పర్యవసానంగా కావేరిని పర్వతమ్మ తిట్టేది. తన నిస్స హాయతను తనతో చెప్పుకుని బాధపడేది పర్వతమ్మ.

వారాలూ నెలలూ గడిచాయి. కావేరిలో కొంచెం మార్పు వచ్చినా, చెప్పుకో దగ్గంత మార్పుకాదది. నిష్కల్మషంగా తెల్లని మనసుతో అందరితోనూ నవ్వుతూ మాట్లాడేది కావేరి. కానీ వయసు తెచ్చిన మార్పు వల్ల కావేరి మాటలలో గూఢార్థం వుందనుకునే వారు కొందరు. ద్వంద్వార్థ భావన వారిలో చోటు చేసుకునేది. విగ్రహంలా అందంగా, ఏపుగా ఎదిగిన అవయవ పుష్టితో, ఎత్తైన వక్షోజాలతో, దృఢమైన జఘన సీమతో, మిసమిసలాడే బుగ్గల నిగ్గులతో పరిపూర్ణమైన స్త్రీ మూర్తిలా కనిపించే కావేరి మీద ఎందరి కళ్ళో పడ్డాయి. కానీ కావేరికి కాపలాగా పర్వతమ్మ ఎప్పుడూ కనిపెట్టు కుంటూ వుండేది.

తను కావేరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం, చుట్టు ప్రక్కల వారి అపోహలకు గురి చేసింది. అంతే కాక ఒకరిద్దరు కావేరి మీద అత్యాచారం చెయ్యబోయి నప్పుడు తను వారిని మందలించడం వల్ల వాళ్ళు కూడా కథలల్లడం మొదలు పెట్టారు.

ఈ విధంగా రోజులు గడుస్తున్న సమయంలో పర్వతమ్మ కావేరి భవిష్యత్తు గురించి ఆలోచించి బాధ పడేది.

ఒకరోజు వున్న ఫళంగా కావేరి వాంతులు చేసు కోవడం మొదలుపెట్టింది. తను కావేరిని డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్ళాడు. ఆహారంలో ఏదో సరి పడని వస్తువులు వుండడం వల్ల బహుశా విరేచనాలూ వాంతులూ వచ్చా యని కొన్ని మందులు రాసిచ్చాడు డాక్టరు.

ఆ నిజం తనకు పర్వతమ్మకు తెలుసు.

కానీ చుట్టు ప్రక్కల వాళ్ళకు నిజానిజాలతో పని లేదు. ముఖ్యంగా ఆడవాళ్ళు కావేరి మీద ఎందుకో పగ, కసి పెంచుకుని అవకాశం కోసం వేచి వుండడంతో ఈ సందర్భం కలిసివచ్చిందనుకుని పిచ్చి పిచ్చి వ్యాఖ్యానాలు చేశారు.



తనకు ఆగ్రహం కట్టలు తెంచుకు వచ్చింది.

అందరి మీదా విరుచుకు పడ్డాడు.

కావేరి 'హైపర్ యాక్టివ్' అమ్మాయని వారికి అర్థమయ్యేలా చెప్పాడు. కానీ వారికి అర్థం కాలేదు. కుసంస్కారం మనిషి వివేకాన్ని అణచి వేస్తుంది. కావేరి ప్రవర్తనకు ఆ జబ్బు కారణం కాదన్నారు. స్వతహాగా ఆమనిషి ప్రవర్తన తీరే అంతఅన్నారు. జబ్బువ్యవహారం అబద్ధం అని కూడా తేల్చారు. పవిత్రమైన కావేరిని పతితగా ప్రచారం చేశారు. నిష్కల్మషంగా, అందరి తోనూ తోబుట్టువులా ప్రవర్తించిన కావేరిని అలా భావించడాన్ని తట్టుకోలేక పోయాడు తను. పర్వతమ్మ కుమిలి పోయింది. మనసులోని ఆవేదనను అణచుకోలేక విచక్షణ కోల్పోయి కావేరిని ఇష్టం వచ్చినట్టు కొట్టింది పర్వతమ్మ. పాపం, అశుభం శుభం ఎరుగని కావేరి జాలిగా, నిస్సహాయురాలిగా తను చేసిన పాపం ఏమిటానని నిలబడింది తగిలిన దెబ్బల నొప్పిని తట్టుకోలేక ఏడుస్తూ-

కావేరి కన్నీటి కావేరి అయింది.

పర్వతమ్మ కుప్పగా కూలి పోయింది.

తను మౌనంగా నిలబడ్డాడు.

తన మొహం అంధకారమయమైంది.

మర్నాడు ఊరు వూరంతా ఏ నోట విన్నా కావేరి మాటే. జనం చెవులు కొరుక్కున్నారు. తనకు ఆ వార్త తెలియగానే పరుగెట్టాడు.

పర్వతమ్మ... ఇంటి ముందు నెత్తి నోరుబాదు కుంటూ కనిపించింది. ఎదురుగుండా గదిలో కావేరి శవం మారుమంచి వేలాడుతూంది.

'కావేరీ...' దిక్కులు పిక్కటిల్లేలా కేక పెట్టాడు తను.

నిష్కల్మషమైన హృదయంతో ఏ తప్పూ చేయని పవిత్రమైన కావేరి మౌనంగా తను అమాయకురాలని చెప్పే విధంగా కనిపించింది.

పర్వతమ్మ మాత్రం... ఈ విషాదాన్ని భరించలేక పోయింది. అతి కష్టం మీద ఆమెను ఓదార్చాడు తను. కొన్ని రోజులు గడిచాయి.

కావేరి పోయిన తరువాత జనం... 'పాపం.... కావేరి' అన్నారు. ఆ మాటలు కేవలం అనాలని అన్న మాటలే కానీ నిజంగా అన్న మాటలు కావని తనకు తెలుసు. ఆ తరువాత కొన్నాళ్ళు తను పర్వతమ్మను ఓదార్చాడు అటు భర్తనూ, ఇటు కూతురినీ పొట్ట బెట్టుకున్న వూళ్ళో వుండలేనని చెప్పిందామె. మరే వూరికి వెళ్ళినా బ్రతుకు తెరువు కష్టమవుతుందనీ... కొన్నాళ్ళకు పరిస్థితులు చక్క బడతాయనీ, మనసును ధైర్యంగా వుంచుకోవాలనీ చెప్పాడు తను.

మరో నెల తిరగడం, తనకు బదిలీ అవడం జరిగాయి. కన్న తల్లిని విడిచి పెట్టి వెళ్ళే కొడుకులా పర్వతమ్మనూ, కైలాసపురాన్నీ వదలి వెళ్ళి పోయాడు. తను వెళ్ళొస్తానని చెప్పినప్పుడు మౌనంగా... బాధగా, కన్నీళ్ళ పర్యంతం తనను చూస్తూ చివరిగా "ఎప్పుడైనా మళ్ళీ వస్తావా..." అని అడిగింది. "తప్పకుండావస్తాను" అని సెలవు తీసుకున్నాడు. అంతవరకూ ముసురుకు వచ్చి మెదలిన ఆలోచనలు ఆగాయి.

కైలాసపురం గెస్ట్ హౌస్ దగ్గరికి వచ్చాడు సూర్యం. ఇందుమించు మూడు సంవత్సరాల తరువాత మళ్ళీ ఉద్యోగ రీత్యా కైలాసపురం రావలసిన అవసరం ఏర్పడి నప్పుడు, అక్కడికి వస్తే జ్ఞాపకాలు తొలిచి వేస్తాయని బాధపడినా గత్యంతరం లేక కైలాసపురం వచ్చిన సూర్యం... పర్వతమ్మను ఈ విధంగా కలుసుకుంటా ననుకోలేదు.

ఒకప్పుడు పర్వతమ్మ ఎలాగుండేది - ఇప్పుడెలా మారిపోయింది, అనుకున్నాడు సూర్యం. మర్నాడు కొందరిని అడిగినప్పుడు తెలిసింది - కావేరి పోయిన తరువాత తను వూరు విడిచి వెళ్ళిన తరువాత పర్వతమ్మ చాలా కాలం మూగ మనిషిగా వుండేదనీ, గత ఆరు నెలల నుంచి మతి భ్రమ చెంది, పిచ్చి దానిలా మారిందనీ అయినా ఎవరికీ ఏ హానీ చెయ్యదనీ, ఎవరు కనిపించినా "బాబూ! కావేరిని చూశారా బాబూ... కావేరి చాలా మంచిది బాబూ" అంటుందని చెప్పారు వాళ్ళు.

ఆ మాటలు వాళ్ళు చెప్తున్నప్పుడు సూర్యం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భరించరాని ఆవేదనకు లోనైన సూర్యా నికి ఈ సమాజం మీద, మనుషుల మీద అసహ్యం వేసింది. సంస్కార హీనుల వల్ల ఆ తల్లీ కూతురూ ఎలా నాశనమయ్యారో తలచుకుని బాధపడ్డాడు సూర్యం.

కానీ... కావేరి మాత్రం సూర్యం దృష్టిలో పవిత్రంగా మిగిలి పోయింది. ●